
ఏర్పాట్ల పరిశీలన

ఎచ్చెర్ల, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): బుడగట్లపాలెంలో సీఎం పర్యటనకు సంబంధించి అధికారులు ఏర్పాట్లను పూర్తిచేశారు. శుక్రవారం బుడగట్లపాలెంలో సభ భద్రత ఏర్పాట్లను విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి పరిశీలించారు. హెలిప్యాడ్, సభా వేదిక, లబ్ధిదారుల కలయిక, కార్యకర్తలతో సమావేశం, అమ్మవారి ఆలయ దర్శనం, వాహనాల పార్కింగ్, తదితర వాటిని ఎస్పీతో కలిసి పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే సభా స్థలాన్ని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. సీఎం పర్యటనను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.



మత్స్యకారుల సేవలో..

- వేట నిషేధం సమయంలో భృతి రెట్టింపు
- నేడు జిల్లాకు రానున్న చంద్రబాబు
- ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెంలో పర్యటన
- గంగపుత్రులతో మాట్లాడనున్న ముఖ్యమంత్రి
- టీడీపీ కేడర్‌తోనూ ప్రత్యేక సమీక్ష
- పూర్తయిన ఏర్పాట్లు

శ్రీకాకుళం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శనివారం జిల్లాకు రానున్నారు. ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెంలో పర్యటించనున్నారు. జిల్లా నుంచే 'మత్స్యకారుల సేవలో' పథకాన్ని ప్రారంభించనున్నారు. తీరప్రాంత మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో ఇచ్చే భృతిని రెట్టింపు చేసి లబ్ధిదారులకు అందజేయనున్నారు. గత ప్రభుత్వం 'మత్స్యకార భరోసా' పథకం కింద మూడేళ్లు రూ.పది వేలు చొప్పున ఇచ్చింది. గతేడాది మాత్రం ఎగనామం పెట్టింది. గతేడాది ఈ పథకం కింద 15,375 మందిని అర్హులను గుర్తించినా.. డబ్బులు మాత్రం అందజేయలేదు. దీంతో తీరప్రాంత మత్స్యకారులు ఏకతాటిపై నిలిచి సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి వ్యతిరేకంగా ఓట్లేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబునాయుడు మత్స్యకార భరోసా సాయాన్ని రెట్టింపు చేశారు. ఈ మేరకు 'మత్స్యకారుల సేవలో' పథకం కింద శనివారం ఒక్కో మత్స్యకారుడికి రూ.20వేలు చొప్పున అందజేయనున్నారు. మత్స్యకారులతో (మిగతా 4వ పేజీలో..)


బుడగట్లపాలెంలో సభా వేదిక వద్ద ఏర్పాట్లు

సీఎం పర్యటన ఇలా..

శ్రీకాకుళం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిలో శనివారం ఉదయం 10 గంటలకు సీఎం చంద్రబాబు బయలుదేరి.. 10.35 గంట లకు విజయవాడ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. 10.40 గంటలకు విమానంలో బయలుదేరి 11.25 గంటలకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టులో దిగుతారు. 11.35 గంటలకు ప్రత్యేక హెలీకాప్టర్‌లో బయలుదేరి బుడగట్లపాలెంలో హెలిప్యాడ్ వద్దకు 11.55 గంటలకు చేరుకుంటారు. 11.55 గంటల నుంచి మధ్యాహ్నం 12.05 వరకు ప్రజాప్రతినిధులు, ఉన్నత అధికారుల నుంచి స్వాగత సత్కారం అందుకుంటారు. 12.20 వరకు ప్రజాప్రతినిధులతో చర్చిస్తారు. 12.25 గంటలకు బుడగట్లపాలెం గ్రామంలోకి ప్రవేశించి అమరావతి దేవాల యాన్ని దర్శించుకుంటారు. అనంతరం స్థానిక మత్స్యకారులతో మధ్యాహ్నం 1.15 గంటల వరకు మాట్లాడతారు. 1.15 నుంచి 1.45 వరకు రిజర్వ్‌గా సమయాన్ని కేటాయించారు. 1.50 గంటలకు బుడగట్లపాలెంలో ప్రజావేదిక వద్దకు చేరుకుని జిల్లా అధికారులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలిస్తారు. 2 గంటల నుంచి 3.40 వరకు సభలో ప్రసంగిస్తారు. 3.45 గంటలకు హెలిప్యాడ్ వద్దకు చేరుకుని 5.15 వరకు టీడీపీ శ్రేణులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తారు. 5.25 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి 5.50 గంటలకు విశాఖలో నేవల్ కోస్టల్ బ్యాటరీ హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. 5.55 గంటలకు విశాఖలో మహారాణిపేట వద్ద ఆంధ్రా మెడికల్ కళాశాలలో కార్యక్రమానికి హాజరవుతారు. రాత్రి 7.25 గంటలకు విశాఖ ఎయిర్ పోర్టులో బయలుదేరి 8.10గంటలకు విజయవాడ చేరుకుంటారు. 8.50 గంటలకు గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఉండవల్లిలో తన నివాసానికి సీఎం చేరుకుంటారు. సీఎం పర్యటన విజయవంతం చేసేందుకు.. మంత్రి అచ్చెన్నా యుడు, జిల్లా అధికారులు పలుదఫాలు బుడగట్లపాలెంలో ఏర్పాట్లను పరిశీలించారు. పర్యటనలో అసాంఘిక శక్తులు చొరబడకుండా 'అడ్వాన్స్ సెక్యూరిటీ లైజెన్'(ఏఎస్ ఎల్) టెక్నాలజీతో భద్రతా చర్యలను ఎస్పీ మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు చేపట్టారు.

పటిష్ఠ బందోబస్తు

ఎచ్చెర్ల, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు పర్యటన సందర్భంగా పటిష్ఠమైన బందోబస్తును ఏర్పాటు చేశామని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. శుక్రవారం బుడగట్లపాలెంలో బందోబస్తు విధి విధానాలపై పోలీసు అధికారులకు, సిబ్బందికి సూచనలు చేశారు. అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. 'సీఎం కాన్వాయ్ వెళ్లే సమయంలో సామాన్య ప్రజానీకానికి ఇబ్బంది లేకుండా ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టాలి. కేటాయించిన స్థలాల్లోనే వాహనాలు పార్కింగ్ చేయాలి. సిబ్బందితో సమన్వయం చేసుకుని ఇన్‌చార్జి అధికారులు అవసరమైన రోప్ పార్టీ, స్పెషల్ పార్టీలను సిద్ధంగా ఉంచుకోవాలి' అని తెలిపారు.

- ఎస్పీ మహేశ్వరరెడ్డి పర్యవేక్షణలో నలుగురు ఏఎస్పీలు, 8 మంది డీఎస్పీలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బందితో కలిపి మొత్తం 1500 మందితో పటిష్ఠమైన బందోబస్తును ఏర్పాటుచేశారు. 17 రోప్ పార్టీలు, స్పెషల్ పార్టీలు, క్యూఆర్టీ టీమ్‌లను ప్రత్యేకంగా సిద్ధం చేశారు. ఎస్పీ పర్యవేక్షణలో పోలీసులు ట్రయల్ రన్ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్పీలు కె.దిరాజ్, పి.శ్రీనివాసరావు, కేవీ రమణ, దేవాప్రసాద్, సీఎం సెక్యూరిటీ వింగ్ ఏఎస్పీ ఏవీ రమణ, డీఎస్పీలు పాల్గొన్నారు.

ఎచ్చెర్లకు నాయకుడెవరు?

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పదవి ఖాళీ
- ఎన్నికల్లో కూటమి తరపున బీజేపీ అభ్యర్థి గెలుపు
- తెలుగుదేశం పార్టీ కేడర్‌ను సమన్వయం చేసేవారు కరువు
- అధినేత చంద్రబాబు దృష్టి సారించాలని కార్యకర్తల వినతి

రణస్థలం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలన నడుస్తోంది. గతేడాది సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీలు కూటమిగా ఏర్పడి 164 స్థానాల్లో విజయం సాధించిన విషయం తెలిసిందే. ఇందులో టీడీపీ అభ్యర్థులకు 135 స్థానాల్లో విజయం దక్కింది. అయితే వైసీపీతోపాటు భాగస్వామ్య పార్టీలు ప్రాతినిధ్యం వహిస్తున్న 40 నియోజకవర్గాలు ఉన్నాయి. అందులో ఎచ్చెర్ల నియోజకవర్గం ఒకటి. ఇక్కడ బీజేపీ అభ్యర్థి నడుకుదుటి ఈశ్వరరావు విజయం సాధించారు. కాగా.. ఎన్నికల ముందు వరకూ నియోజకవర్గం ఇన్‌చార్జి బాధ్యతలను కిమిడి కళా వెంకటరావు చూసుకునేవారు. ఎన్నికల తర్వాత ఇంతవరకూ ఇక్కడ టీడీపీకి ఇన్‌చార్జిని నియమించకపోవడం లోటే. అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేయడంతో కేడర్‌ను సమన్వయం చేసేవారు కరువయ్యారు. ఈ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ద్వితీయ శ్రేణి నాయకులే సమన్వయం చేసుకోవాల్సి వస్తోంది. టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు ఎచ్చెర్ల నియోజకవర్గంలో పర్యటించనున్న నేపథ్యంలో నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రకటన చేయాలని తెలుగు తమ్ముళ్లు కోరుతున్నారు.

- బలమైన కేడర్ ఉన్నా.. టీడీపీకి లోటే..

ఎచ్చెర్ల నియోజకవర్గంలో టీడీపీకి బలమైన కేడర్ ఉంది. టీడీపీ ఆవిర్భావం నుంచీ పదిసార్లు (మిగతా 4వ పేజీలో..)


బుడగట్లపాలెం తీరంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు తదితరులు


బుడగట్లపాలెంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీఐజీ గోపీనాథ్ జట్టి, ఎస్పీ మహేశ్వరరెడ్డి

జాతీయ లోక్ అదాలత్ తేదీల మార్పు

గుజరాతీపేట, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 19న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్.. అనివార్య కారణాలతో జూలై 5కి మార్పు చేశామని జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని కక్షిదారులు, న్యాయవాదులు, ప్రభుత్వ, బ్యాంకు, ఇన్స్యూరెన్స్ అధికారులు, పోలీసులు గమనించాలని సూచించారు.

సీఎం వస్తారని.. వరాలు ఇస్తారని..

4లో

- ఉపాధి దూరమై.. వలసలే మార్గమై
- పరిశ్రమల్లో కానరాని 'స్థానికత' నిబంధన
- ఎక్కడి సమస్యలు అక్కడే
- ఎచ్చెర్ల నియోజకవర్గ ప్రజలకు తప్పని ఇబ్బందులు
- హార్బర్‌కు కదలిక వచ్చేనా?
- 'అణువిద్యుత్'పై స్పష్టత ఏదీ?

ట్రిపుల్ ఐటీ ప్రవేశాలకు వేళాయే

- మొత్తం 4,400 సీట్ల భర్తీకి సన్నాహాలు
- రేపటి నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- జూన్ 5న జాబితా విడుదల
- 11 నుంచి కౌన్సెలింగ్
- 30 నుంచి తరగతులు

ఎచ్చెర్ల, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఆరేళ్ల కోర్సు.. సీటు వచ్చిందంటే చాలు.. ఉజ్వల భవిత పొందవచ్చు. ప్లస్ 2(పీయూసీ రెండేళ్లు), ఇంజనీరింగ్ నాలుగేళ్ల కోర్సు పూర్తిచేసి ఎంచక్కా అటు నుంచి అటే ఉద్యోగంలో చేరే అద్భుత అవకాశం. ఇదీ ట్రిపుల్ ఐటీ ప్రత్యేకత. అందుకే ఈ కోర్సులో చేరేందుకు చాలామంది విద్యార్థులు ఇష్టపడుతుంటారు. ఇటీవల పదో తరగతి ఫలితాలు వెల్లడైన వేళ.. ట్రిపుల్ ఐటీ ప్రవేశాలకు రంగం సిద్ధమైంది. మన రాష్ట్రంలో రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీ(ఆర్జీయూకేటీ) పరిధిలో శ్రీకాకుళం(ఎచ్చెర్లలోని ఎస్.ఎం. పురం), నూజివీడు, ఒంగోలు, ఇడుపులపాయ(ఆర్ కే వ్యాలీ)లో ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లు ఉన్నాయి. ఈ క్యాంపస్‌ల్లో అడ్మిషన్లకు ఆర్జీయూకేటీ ఈ నెల 24న నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ మేరకు ఈ నెల 27 నుంచి మే 20వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారు. పదో తరగతిలో మార్కులు, రిజర్వేషన్ ప్రాతిపదికన మెరిట్ జాబితాను రూపొందించి.. కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లను కేటాయిస్తారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సాంకేతిక విద్యను అందించేందుకు ట్రిపుల్ ఐటీలను ప్రారంభించారు. ఇందులో సీటు పొందే ప్రతి విద్యార్థికి మంచి భవిష్యత్ ఉంటుందనడంలో సందేహంలేదు. క్యాంపస్ నుంచే బహుళ జాతి కంపెనీల్లోకి ఉద్యోగాల్లోకి వెళ్లే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

కోర్సులివే

ట్రిపుల్ ఐటీలో కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్ కోర్సులు ఉన్నాయి. నూజివీడు, ఆర్‌కే వ్యాలీ క్యాంపస్‌ల్లో వీటితోపాటు మెటీరియల్ సైన్స్ అండ్ మెటలర్జికల్ సైన్స్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్ కోర్సులు అదనంగా ఉన్నాయి.

జూన్ 5న ఎంపిక జాబితా

ఆర్జీయూకేటీ పరిధిలో ట్రిపుల్ ఐటీలో సీటుకు ఎంపికైన అభ్యర్థుల జాబితా జూన్ 5న ప్రకటిస్తారు. జూన్ 11 నుంచి 17 వరకు సర్టిఫికెట్ల పరిశీలన, కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. జూన్ 30 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి. నూజివీడు క్యాంపస్‌లో పీహెచ్‌సీ, క్యాప్, ఎన్‌సీసీ, స్పోర్ట్స్, స్కౌట్స్ అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలిస్తారు. ఒక్కో క్యాంపస్‌లో వెయ్యి సీట్లు, అదనంగా ఈడబ్ల్యూఎస్ కింద మరో 100 సీట్లు ఉంటాయి. మొత్తం ఆర్జీయూకేటీ పరిధిలోని నాలుగు క్యాంపస్‌ల్లో 4,400 సీట్లను భర్తీ చేస్తారు. పీయూసీకి ఏడాదికి ట్యూషన్ ఫీజు రూ.45 వేలు, ఇంజనీరింగ్‌కు ఏడాదికి రూ.50 వేలుగా నిర్ణయించారు. తెలుగేతర రాష్ట్రాల వారికి 25 శాతం సూపర్ న్యూమరీ సీట్లు అందుబాటులో ఉంటాయి. ఈ అభ్యర్థులు ఏడాదికి ట్యూషన్ ఫీజు రూ.1.50 లక్షలు చెల్లించాలి.

ఇవీ అర్హతలు


పదోతరగతి లేదా తత్సమాన పరీక్షలో 2024-25 విద్యా సంవత్సరంలో రెగ్యులర్ విద్యార్థులుగా తొలి ప్రయత్నంలో ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసేందుకు అర్హులు. ఓసీ, ఈడబ్ల్యూఎస్, బీసీ విద్యార్థులు రూ.300, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.200 దరఖాస్తు రుసుం చెల్లించాలి. మొత్తం సీట్లలో 85శాతం లోకల్ విద్యార్థులకు(ఆంధ్రప్రదేశ్), 15 శాతం (మిగతా 4వ పేజీలో..)



శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్



సీఎం వస్తారని.. వరాలు ఇస్తారని!



శ్రీకాకుళం జిల్లాకు ముఖద్వారంగా భావించే ఎచ్చెర్ల నియోజకవర్గాన్ని దశాబ్దాలుగా అనేక సమస్యలు వేధిస్తున్నాయి. పేరుకు పరిశ్రమలు స్వాగతం చెబుతున్నట్టు మనకు కనిపించినా... అవేవీ స్థానికులను ఆదుకోలేకపోతున్నాయి. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకపోవడంతో పొట్ట చేత పట్టుకొని సుదూర ప్రాంతాలకు వలస పోవాల్సి వస్తోంది. కీలకమైన అణువిద్యుత్తు ప్రాజెక్టుకు కదలిక లేదు. రైతులకు తాగు, సాగు నీరు అందడం లేదు. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబునాయుడు శనివారం ఈ ప్రాంతానికి రానున్నారు. అనేక సమస్యలకు నేటితో పరిష్కారం లభిస్తుందని స్థానికులు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు.

ఉపాధి దూరమై.. వలసలే మార్గమై

- పరిశ్రమల్లో కానరాని 'స్థానికత' నిబంధన
- ఉత్తరాది రాష్ట్రాలకు పెద్దపీట

రణస్థలం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఎక్కడైనా పరిశ్రమలు ఏర్పాటు చేస్తే స్థానికులకు ప్రాధాన్యం ఇవ్వాలి. నిబంధనల ప్రకారం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వారికే కల్పించాలి. కానీ పైడిభీమవరం పారిశ్రామిక వాడతో పాటు నియోజకవర్గంలోని పరిశ్రమల్లో ఎక్కడా ఈ నిబంధన అమలవుతున్న దాఖలాలు లేవు. ఎచ్చెర్ల నియోజకవర్గం పూర్తిగా మెట్ట ప్రాంతం. రియల్ భూమ్ వచ్చిన తరువాత ఇక్కడ భూముల ధరలు పెరిగాయి. కానీ భూములు లేని వారికి మాత్రం ఎటువంటి ఉపాధి లేకుండా పోతోంది. ముఖ్యంగా వరి వంటి సంప్రదాయ పంటలు పండవు. అందుకే ఇక్కడి ప్రజలు సుదూర ప్రాంతాలకు వలస వెళుతుంటారు. పైడిభీమవరం పారిశ్రామిక వాడతో పాటు నియోజకవర్గంలో అనేక పరిశ్రమలు ఉన్నాయి. కానీ స్థానికులకు ఇక్కడి పరిశ్రమల యాజమాన్యాలు ఉద్యోగాలు ఇవ్వడం లేదు. దశాబ్దాల కిందట పైడిభీమవరంలో పారిశ్రామికవాడను ఏర్పాటు చేశారు. ఎన్నో పరిశ్రమలను నెలకొల్పారు. కానీ అవి కనీస నాణ్యతా ప్రమాణాలు, భద్రతా చర్యలు పాటించడం లేదు. అటు ఉపాధి, ఉద్యోగాల్లో స్థానికులకు ప్రాధాన్యం ఇవ్వకపోవడంతో తమ త్యాగాలకు విలువ లేకుండా పోయిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానికులకు ఉద్యోగాలు కల్పించడంతో పాటు కాలుష్యం లేకుండా చూడాలని కోరుతున్నారు.

స్థానికులకు ఉపాధి కల్పించాలి

స్థానికంగా ఉన్న మాలాంటి యువతకు అస్సలు ఉపాధి లభించలేదు. ఏ పరిశ్రమ చూసినా ఉత్తరాధి రాష్ట్రాల వారే కనిపిస్తున్నారు. కనీసం స్థానికులకు ఎక్కడా ప్రాధాన్యం లభించడం లేదు. అసలు ఉద్యోగ నియామకాలు అంటూ జరిపిన దాఖలాలు లేవు. స్థానికులకు ఉపాధి కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి

- సరగడ సుమలత, నిరుద్యోగి, పైడిభీమవరం

త్యాగం వృథా అయ్యింది..

పరిశ్రమల కోసం చేసిన త్యాగాలు వృథా అయిపోయాయి. పిల్లల భవిష్యత్ బాగుంటుందని పరిశ్రమల ఏర్పాటుకు భూములను వదులుకున్నాం. ఇప్పుడు మా పిల్లలకు ఉద్యోగాలు లేవు. పైగా కాలుష్యంతో అనారోగ్యానికి గురవుతున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం కాలుష్యాన్ని నియంత్రించే చర్యలు చేపట్టాలి.

- కుప్పిలి శ్రీనివాసరావు, స్థానికుడు, పైడిభీమవరం

నాలుగు దశాబ్దాల కిందట..

రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (ఏపీఐఐసీ) జిల్లాలో పరిశ్రమలను స్థాపించేలా 1985లో పైడిభీమవరంలో 450 ఎకరాల్లో భారీ పారిశ్రామిక వాడను ప్రారంభించింది. ఇందులో 275 ఎకరాలను రసాయనిక జోన్‌కు కేటాయించింది. ప్రస్తుతం ఈ ప్రాంతంలో 13 రసాయన పరిశ్రమలు కొనసాగుతున్నాయి. ఎచ్చెర్ల మండలం కుశాలపురంలో 16 ఎకరాలు, పలాసలో 31, ఆమదాలవలసలో 19 ఎకరాలతో పారిశ్రామిక వాడలను ఏర్పాటు చేసింది. ఇందులో పైడిభీమవరమే అన్నింటికంటే పెద్దది. కానీ స్థానికులకు ఇక్కడ ఉపాధి దొరికింది. కానీ ఈ ప్రాంతాన్ని కాలుష్యం కమ్మేస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సత్వర చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. స్థానికులకు ఉపాధి కల్పించడంతో పాటు కాలుష్య నియంత్రణపై దృష్టి పెట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



పరిశ్రమల వ్యర్థాలతో కలుషితమవుతున్న కందివలస గెడ్డ (ఫైల్)

ఎక్కడి సమస్యలు అక్కడే!

- తాగు, సాగునీరు లేదు
- ఎచ్చెర్ల నియోజకవర్గ ప్రజలకు ఇబ్బందులు
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

రణస్థలం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్నట్టు ఉంది ఎచ్చెర్ల నియోజకవర్గం పరిస్థితి. నియోజకవర్గ వ్యాప్తంగా పరిశ్రమలు, పేరుమోసిన విద్యాసంస్థలు ఉన్నా.. ఆశించిన స్థాయిలో అభివృద్ధి లేదు. పేరుకే స్థానికం తప్ప.. ఎక్కడా పరిశ్రమల్లో స్థానికులకు ప్రాధాన్యం ఇవ్వడం లేదు. పోనీ ప్రజలకు మౌలిక వసతులు ఉన్నాయా అంటే.. అవీ కనిపించడం లేదు. గుక్కెడు నీటి కోసం పదుల సంఖ్యలో గ్రామాలు ఇబ్బందులు పడుతున్నాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ముఖ్యంగా సాగు, తాగునీటి కోసం ప్రజలు అవస్థలు పడుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుపైనే వీరంతా ఆశలు పెట్టుకున్నారు. ముఖ్యమంత్రి పర్యటనతో తమ సమస్యలు తీరుతాయని భావిస్తున్నారు. ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యే నడుకుదుటి ఈశ్వరరావు అసెంబ్లీలో ఈ సమస్యలను ప్రస్తావించారు. ముఖ్యమంత్రి దృష్టికి వ్యక్తిగతంగానూ తీసుకెళ్లారు. ఈ నెల 26న సీఎం చంద్రబాబు పర్యటన నేపథ్యంలో ఎచ్చెర్ల నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలను పరిశీలిద్దాం...

సాగునీటి వనరులూ అంతంతే..

ఎచ్చెర్ల నియోజకవర్గం పూర్తిగా మెట్ట ప్రాంతం. కనీస స్థాయిలో కూడా సాగునీటి వనరులు లేవు. ఈ పరిస్థితుల్లో గతంలో టీడీపీ ప్రభుత్వం తోటపల్లి కాలువను జి.సిగడాం, లావేరు మీదుగా రణస్థలం మండలానికి విస్తరించింది. దీంతో కొంతవరకూ సాగునీటి అవసరాలు తీరాయి. కానీ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో తోటపల్లి కాలువపై అంతులేని నిర్లక్ష్యం కొనసాగింది. శివారు ఆయకట్టుగా ఉన్న ఎచ్చెర్ల నియోజకవర్గానికి నీరు వచ్చిందా? లేదా? అని పట్టించుకునే వారు కరువయ్యారు. తక్షణ కర్తవ్యంగా తోటపల్లి కాలువను ఆధునికీకరించరాలి. అదే సమయంలో పైడిభీమవరం చెంతనే ఉన్న కందివలస గెడ్డను శుద్ధి చేయాలి. ఆక్రమణలు తొలగించడంతో పాటు పూడికను తొలగించాల్సిన అవసరం ఉంది. పరిశ్రమలు వ్యర్థాలు వదలకుండా కట్టడి చేయాలి. లావేరు మండలంలో ఉన్న బుడుమూరు గడ్డను సైతం ఆధునికీకరించాలి. ఎచ్చెర్ల మండలంలో ఉన్న నారాయణవలస కాలువను పునరుద్ధరించాలి. ఈ చర్యలతోనే ఎచ్చెర్ల నియోజకవర్గానికి భవిష్యత్‌లో నీటి గండం లేకుండా చూడవచ్చు.

ప్రమాదంలో 76 గ్రామాలు

ఎచ్చెర్ల నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటు స్థానికులకు వరమో..శాపమో తెలియని పరిస్థితి. పరిశ్రమల అవసరాలకు మితిమీరిన స్థాయిలో భూగర్భ జలాలను తోడేస్తుండడంతో జిల్లాలోని దాదాపు 76 గ్రామాల్లో భవిష్యత్‌లో నీరు అన్నదే పుట్టకపోవచ్చునని అధ్యయనాల్లో తేలుతుండడం ఆందోళన కనిపిస్తోంది. రాష్ట్రంలో భూగర్భ జలాలు తక్కువగా ఉన్నవి 2,617 గ్రామాలు ఉన్నాయి. అందులో 300 గ్రామాలలో ప్రమాదభరితంగా నీటిని తోడేస్తున్నారని తేలింది. ఈ గ్రామాల్లో ఎచ్చెర్ల నియోజకవర్గంలోని 70 గ్రామాలు ఉన్నాయని తేలడం ఆందోళన కలిగిస్తోంది. అందులోనూ రణస్థలం మండలంలో 46 గ్రామాలు ఉండడం గమనార్హం. జి.సిగడాం మండలంలో 6, ఎచ్చెర్లలో ఒకటి, లావేరులో 17 గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు దీనిపై దృష్టి సారించాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు. భూగర్భ జలాల పెంచేందుకు యత్నించడంతో పాటు ప్రత్యేక తాగునీటి పథకాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



తోటపల్లి కాలువ

కాలువను ఆధునికీకరించాలి

తోటపల్లి కాలువ ఉందన్న మాట కానీ.. నిత్యం సాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదు. వర్షాకాలంలో... అది కూడా భారీ వరదలు వచ్చే సమయంలోనే కాలువలో నీరు పారుతోంది. లేకుంటే నీరు లేకుండా కనిపిస్తోంది. కూటమి ప్రభుత్వం స్పందించి కాలువను ఆధునికీకరించాలి. శివారు ఆయకట్టుకు సాగునీరు అందించాలి.

- దన్నాన స్వామినాయుడు, రైతు, రణస్థలం మండలం

హార్బర్‌కు కదలిక వచ్చేనా?

- రెండేళ్ల క్రితం బుడగట్లపాలెంలో శంకుస్థాపన
- ప్రస్తుతం ఎక్కడి పనులు అక్కడే
- మత్స్యకారుల ఎదురుచూపులు

ఎచ్చెర్ల, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల చిరకాల వాంఛ అయిన బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్ పనుల్లో కదలిక లేదు. ఈ జిల్లాలో సుదూర తీర ప్రాంతం ఉన్నా చేపల వేటకు అనుకూలంగా లేదు. హార్బర్ పనులు పూర్తయితే మత్స్యకారుల కుటుంబాల్లో వెలుగురేఖలు నిండుతాయి. పనులు ప్రారంభం కాకపోవడంతో మత్స్యకారుల వేదన ఆ సముద్రుడికే ఎరుక. చేపల వేట నిషేధ సమయంలో ప్రభుత్వం మత్స్యకార భరోసా పేరిట ఒక్కో మత్స్యకారునికి రూ.20 వేల వంతున అందజేయనుంది. ఈ పథకాన్ని ప్రారంభించేందుకు ఈ నెల 26న బుడగట్లపాలెం గ్రామానికి ముఖ్యమంత్రి చంద్రబాబు వస్తుండడంతో గంగపుత్రుల్లో రేపటిపై ఆశలు కలుగుతున్నాయి. సీఎం రాకతో హార్బర్ పనులపై స్పష్టత వస్తుందని మత్స్యకారులు గట్టిగా నమ్ముతున్నారు.

ఇదీ హార్బర్ కథ

2023 ఏప్రిల్ 19న అప్పటి ముఖ్యమంత్రి జగన్ మూలపేట పోర్టు నిర్మాణ పనులకు శంకుస్థాపనకు జిల్లాకు వచ్చారు. అదే రోజు ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెం వద్ద ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. రూ.365.81 కోట్ల అంచనా వ్యయంతో హార్బర్ పనులు చేపడతామని అప్పట్లో ప్రకటించారు. దీంతో మత్స్యకారులంతా తమ బతుకులు బాగుపడతాయని ఎంతో సంబరపడ్డారు. 18 నెలల్లో హార్బర్ పనులు పూర్తి చేస్తామని అప్పటి సీఎం జగన్ ఆనాడు ఎంతో ఆర్భాటంగా ప్రకటించారు. కానీ ఇది ప్రకటనలకే పరిమితమైంది.



బుడగట్లపాలెం తీరానికి గ్రావెల్ రోడ్డు వేసి సగంలో నిలిపేసిన దృశ్యం

వ్యయం తగ్గించేందుకు...

శ్రీకాకుళం జిల్లాలోని బుడగట్లపాలెం, విశాఖపట్నం జిల్లాలోని పూడిమడక, పశ్చిమ గోదావరి జిల్లాలోని బియ్యపతిప్ప, ప్రకాశం జిల్లా కొత్తపట్నం, వాడరేవు వద్ద ప్రతిపాదించిన హార్బర్ల వ్యయాన్ని తగ్గించేందుకు కూటమి ప్రభుత్వం యోచిస్తోంది. ఇందులో భాగంగా ఇటీవల మత్స్య, రెవెన్యూ అధికారులు బుడగట్లపాలెం తీరాన్ని సందర్శించి రీ ఎలైన్‌మెంటు కోసం పరిశీలించారు. బ్రేక్ వాటర్ కోసం వ్యయాన్ని తగ్గిస్తే చాలా వరకు నిర్మాణ వ్యయం తగ్గుతుందని భావిస్తున్నారు. రాష్ట్రంలోని ఐదు హార్బర్లను కలిపి రివైజ్డ్ డీపీఆర్‌లను తయారు చేస్తున్నారు.

సౌకర్యాలు సున్నా..

జిల్లాలో సుదూర తీర ప్రాంతం ఉన్నప్పటికీ, చేపల వేటకు అనుకూలమైన పరిస్థితులు లేవు. దీంతో జిల్లాలోని మత్స్యకారులు గుజరాత్ తదితర ప్రాంతాలకు ఏటా సీజన్‌లో చేపల వేటకు వలసపోతున్నారు. గుజరాత్‌లో తీరం వెంబడి జెట్టీలు ఉన్నాయి. ఈ జిల్లాలో జెట్టీలు, హార్బర్‌లు లేకపోవడంతో మత్స్యకారులు చేపల వేటకు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. పరాయి రాష్ట్రాలకు చేపల వేటకు వలసపోయే మత్స్యకారులు అక్కడ కూడా చాలా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కొవిడ్ సమయంలో గుజరాత్, కర్ణాటక తదితర ప్రాంతాలకు వలసవెళ్లిన మత్స్యకారులు స్వగ్రామాలకు చేరుకునేందుకు పడిన పాట్లు వర్ణనాతీతం. ఫిషింగ్ హార్బర్ పనులు పూర్తయితే తప్ప మత్స్యకారుల వలసలకు బ్రేక్ పడే పరిస్థితి లేదు.

ప్రారంభమవుతాయని ఆశ

మత్స్యకార భరోసా పథకంలో చెల్లించే మొత్తాన్ని రెట్టింపు చేసి సీఎం చంద్రబాబు నాయుడు మత్స్యకార కుటుంబాల్లో ఆనందాన్ని నింపారు. ముఖ్యమంత్రి రాకతో బుడగట్లపాలెం హార్బర్ పనుల్లో కదలిక వస్తుందని ఆశిస్తున్నాం. హార్బర్ ఏర్పాటైతే ఈ ప్రాంతం నుంచి మత్స్యకారుల వలసలను నివారించవచ్చు.

- అల్లుపల్లి రాంబాబు, సర్పంచ్, బుడగట్లపాలెం

'అణు విద్యుత్'పై స్పష్టత ఏదీ?

- దశాబ్దాలుగా అదే ప్రతిష్టంభన
- సీఎం స్పందన కోసం ఎదురుచూపు

రణస్థలం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కొవ్వాడ అణు విద్యుత్ పరిశ్రమ విషయంలో దశాబ్దాలు గడుస్తున్నా అడుగు ముందుకు పడడం లేదు. ఇక్కడ అణువిద్యుత్ కేంద్రం ఏర్పాటు చేస్తామని మూడు దశాబ్దాల కిందటే అధికార యంత్రాంగం ప్రకటించింది. కానీ ఇంతవరకూ ఏర్పాటు చేయలేకపోయింది. భూసేకరణ.. నిర్వాసితులకు పరిహారం చెల్లింపు వంటి ప్రక్రియలు పూర్తయ్యాయి. కానీ ప్లాంట్ నిర్మాణం మాత్రం ఇంతవరకూ ప్రారంభం కాలేదు. అటువంటి చర్యలేవీ కనిపించడం లేదు కూడా. కనీసం కూటమి ప్రభుత్వమైనా దీనిపై కార్యాచరణ రూపొందించాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు. మొన్నటికి మొన్న చంద్రబాబు అసెంబ్లీలో దీనిపై కీలక ప్రకటన చేశారు. ఇప్పుడు జిల్లా పర్యటనతో దీనిపై స్పష్టతనిస్తారని ఆశిస్తున్నారు.

మూడు దశాబ్దాల కిందట..

1991లో కొవ్వాడ పరిసర ప్రాంతాల్లో అణు విద్యుత్ పరిశ్రమ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. దీనిని మొదట్లో మత్స్యకారులు, ప్రజాసంఘాలు, పర్యావరణవేత్తలు తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రజల్లో ఉన్న భయాందోళనలు, అపోహలు నివృత్తి చేసి... ప్లాంట్ ఏర్పాటు చేస్తామని చెప్పడంతో వారు అంగీకారం తెలిపారు. దీంతో మత్స్యకారులు భూసేకరణకు అంగీకరించారు. రూ.లక్ష కోట్ల వ్యయంతో 1208 మెగావాట్ల సామర్థ్యంతో ఆరు రియాక్టర్ల ఏర్పాటుకు సన్నాహాలు చేశారు. భూసేకరణతో పాటు పరిహారం చెల్లింపు పూర్తయింది. కానీ పరిశ్రమ ఏర్పాటు విషయంలో మాత్రం తాత్సారం జరుగుతోంది. మధ్యలో వైసీపీ ప్రభుత్వ హయాంలో అణు విద్యుత్ పరిశ్రమ ఏర్పాటుపై కదలిక వచ్చింది. అప్పట్లో వైసీపీకి చెందిన విజయసాయిరెడ్డి రాజ్యసభలో పరిశ్రమ ఏర్పాటు చేస్తారా? లేదా? అని ప్రశ్నించారు. దీనిపై అప్పటి మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ సమాధానం ఇచ్చారు. అమెరికా సహకారంతో తప్పకుండా ప్లాంట్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. కానీ ఆ తరువాత ఎటువంటి కదలిక లేకపోయింది.

2,079 ఎకరాల సేకరణ

అణు విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు కోసం సుమారు 2,079 ఎకరాల భూమిని సేకరించారు. న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐఎల్) కొవ్వాడ పంచాయతీ పరిధిలోని కొవ్వాడ, చిన్నకొవ్వాడ, టెక్కలి, గూడెం, రామచంద్రాపురం గ్రామాల వారిని నిర్వాసితులుగా ప్రకటించింది. వీటి పరిధిలో 2,079 ఎకరాలను సేకరించారు. ఇళ్లు కోల్పోయిన వారికి ఎన్‌పీసీఐఎల్ వారే స్వయంగా ఇళ్లు కట్టిస్తామని ప్రకటించారు. దీని కోసం అనేక ప్రాంతాలను పరిశీలించారు. తీవ్ర తర్జనభర్జనల నడుమ చివరకు ఎచ్చెర్ల మండలం ధర్మవరంలో నిర్వాసిత కాలనీ ఏర్పాటుకు నిర్ణయించారు. 190 ఎకరాలను రైతుల నుంచి సేకరించారు. 2013 భూసేకరణ చట్టానికి అనుగుణంగా పరిహారాన్ని చెల్లించారు. పరిహారం చెల్లింపులో కొంత మొత్తం పెండింగ్‌లో ఉన్నట్టు తెలుస్తోంది. అటు పరిశ్రమ ఏర్పాటు కాక.. ఇటు భూములపై హక్కులు లేక.. మరోవైపు పునరావాస గ్రామాల్లో ఇళ్ల నిర్మాణం.. మౌలిక వసతులు లేక నిర్వాసితులు గందరగోళంలో ఉన్నారు. వీలైనంత త్వరగా సమస్యలకు పరిష్కారం చూపి.. ప్లాంట్ ఏర్పాటు చేయాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు. ఈ విషయంలో సీఎం చంద్రబాబు స్పష్టతనిస్తారని ప్రజలు ఎదురు చూస్తున్నారు.

మూడు దశాబ్దాలుగా అదే మాట


అణు విద్యుత్ పరిశ్రమ ఏర్పాటు విషయం మూడు దశాబ్దాలుగా ఊగిసలాడుతోంది. అదిగో ఇదిగో అంటున్నారే తప్ప ఏర్పాటు చేయడం లేదు. పరిశ్రమ పేరు చెప్పి భూములను సేకరించారు. కానీ ఇంతవరకూ నెలకొల్పలేదు. ఈ విషయంలో ప్రభుత్వం చొరవ చూపాలి. లేకుంటే భూములను వెనక్కి తీసుకోవాలి.

- మైలపల్లి పోలీసు, స్థానికుడు, కొవ్వాడ

భూములను వెనక్కి ఇవ్వాలి

కొవ్వాడ అణు విద్యుత్ పరిశ్రమ విషయంలో సీఎం చంద్రబాబు స్పష్టతనివ్వాలి. విద్యుత్ ఆధారిత పరిశ్రమలకు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యమిస్తున్న తరుణంలో ఈ పరిశ్రమ ఏర్పాటు అనివార్యం. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపించాల్సిన అవసరం ఉంది. ఒక వేళ పరిశ్రమ ఏర్పాటు చేయకుంటే భూములను వెనక్కి ఇవ్వాలి.

- మైలపల్లి అప్పారావు, స్థానికుడు, కొవ్వాడ



కొవ్వాడ గ్రామం

మత్స్యకారుల సేవలో..

(మూడో పేజీ తరువాయి)

నేరుగా మాట్లాడి సమస్యలు తెలుసుకోనున్నారు. టీడీపీ కేడర్ తోనూ ప్రత్యేక సమీక్ష నిర్వహించనున్నారు.

15,548 మందికి లబ్ధి

జిల్లాలో 104 తీరప్రాంత గ్రామాలు ఉన్నాయి. ఇందులో 60 ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌లు ఉన్నాయి. ఇందులో 1600 ఇంజన్ బోట్లతోనూ... 2800 సంప్రదాయ పడవలతోనూ మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లి చేపల వేట సాగిస్తున్నారు. జిల్లా మత్స్యశాఖ ఈ ఏడాది మత్స్యకార భరోసా కింద 15,548 మంది మత్స్యకారులను అర్హులుగా గుర్తించింది. వీళ్లందరికీ రూ.20వేలు చొప్పున ప్రభుత్వం అందజేయనుంది. గత ప్రభుత్వం కన్నా రెట్టింపు సాయం అందజేయనుండడంతో మత్స్యకారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

హామీని నెరవేరుస్తున్నాం

మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది. మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం మత్స్యకారులకు 'భరోసా' కింద ఇచ్చే నగదు సాయాన్ని రెట్టింపు చేశాం.

- అచ్చెన్నాయుడు, మత్స్యశాఖ మంత్రి

హర్షణీయం

టీడీపీ హయాంలో మత్స్యకారులకు వేట నిషేధ భృతి అందజేశారు. గత వైసీపీ ప్రభుత్వం కొందరికి రూ.10వేలు చొప్పున ఇచ్చి.. రాజకీయంగానూ పలు లబ్ధిదారులను మార్పు చేసి వేరేవాళ్లకు అందజేసింది. ప్రస్తుతం రెట్టింపు సాయంగా ఒక్కో మత్స్యకారుడికి రూ.20వేలు చొప్పున అందజేయనుండడం హర్షణీయం. సీఎం చంద్రబాబుకు, మత్స్యశాఖ మంత్రి అచ్చెన్నాయుడుకు కృతజ్ఞతలు.

- మైలపల్లి నర్సింగరావు, జిల్లా మత్స్యకార సంఘం మాజీ అధ్యక్షుడు

ఎచ్చెర్లకు నాయకుడెవరు?

(మూడో పేజీ తరువాయి)

ఎన్నికలు జరగ్గా.. ఆరుసార్లు ఆ పార్టీ అభ్యర్థులు విజయం సాధించారు. ఇది 2004 వరకూ ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గం. 2009లో నియోజకవర్గాల పునర్విభజనతో జనరల్ అయ్యింది. ఎన్టీఆర్ పిలుపు మేరకు టీడీపీలో చేరిన ప్రతిభాభారతి 1983 ఎన్నికల్లో తొలిసారి పోటీచేసి విజయం సాధించారు. 1999 వరకూ ఎచ్చెర్ల నియోజకవర్గం నుంచి గెలుస్తూనే ఉన్నారు. కానీ 2004, 2009 ఎన్నికల్లో మాత్రం కాంగ్రెస్ గెలిచింది. 2014లో తిరిగి టీడీపీ అభ్యర్థిగా పోటీచేసిన కళా వెంకటరావు గెలిచారు. 2019లో వైసీపీ అభ్యర్థి, 2024 ఎన్నికల్లో టీడీపీ సహకారంతో బీజేపీ అభ్యర్థి గెలిచారు. ఈ నియోజకవర్గంలో ఎచ్చెర్ల, రణస్థలం, జి.సిగడాం, లావేరు మండలాలు ఉన్నాయి. ఈ నాలుగు మండలాలు టీడీపీకి పట్టున్నవే. క్షేత్రస్థాయిలో ఇక్కడ టీడీపీకి బలం ఉన్నా.. బీజేపీ అభ్యర్థి ఎమ్మెల్యే కావడంతో ఆ పార్టీకి కలిసొచ్చే అంశం. పైగా ఎన్నికలకు ముందు వైసీపీ మెజార్టీ కేడర్ బీజేపీలోకి వచ్చింది. పార్టీకి చెందిన ఎమ్మెల్యే కావడంతో బీజేపీ కార్యక్రమాలు చురుగ్గా సాగుతున్నాయి. జనసేన పార్టీకి కూడా నియోజకవర్గ బాధ్యులు, కార్యవర్గ సభ్యులు ఉండడంతో సభ్యత్వ నమోదు, పార్టీ కార్యక్రమాలు జోరుగా జరుగుతున్నాయి. కాగా టీడీపీ నుంచి మాత్రం ఆశించిన స్థాయిలో కార్యక్రమాలు లేవు. టీడీపీ సభ్యత్వ నమోదును మండలాల నాయకులు విజయవంతంగా పూర్తిచేశారు. కానీ కార్యక్రమాల నిర్వహణ, సభలు, సమీక్షలు, సమన్వయం విషయంలో మాత్రం ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయి. అందర్నీ సమన్వయం చేసే సీనియర్ నేతకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించాలని కేడర్ కోరుతోంది. ఇప్పటికైనా టీడీపీ అధిష్ఠానం, జిల్లా నాయకత్వం ఎచ్చెర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతల విషయంలో ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరముంది.

ట్రిపుల్ ఐటీ ప్రవేశాలకు వేళాయే!

(మూడో పేజీ తరువాయి)

ఓపెన్ సీట్లు ఏపీ, తెలంగాణ విద్యార్థులకు కేటాయిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు పదోతరగతి మార్కులకు 0.4 గ్రేస్ పాయింట్లను అదనంగా కేటాయిస్తారు. మరిన్ని వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ డాట్ ఆర్జీయూకేటీ డాట్ ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలి.

గడువులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు నిర్దేశించిన గడువులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. నిర్దేశించిన అంశాలన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించి దరఖాస్తు చేయాలి. ఆసక్తి, అర్హత గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

- డాక్టర్ కేవీజీడీ బాలాజీ, ట్రిపుల్ ఐటీ డైరెక్టర్, శ్రీకాకుళం క్యాంపస్

ఉద్యోగావకాశాలు వస్తాయంటే జగన్‌కు నచ్చడం లేదు: ఎంపీ

శ్రీకాకుళం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్టణంలో ఒక సంస్థ ఏర్పాటు చేయడం వల్ల పదివేల మందికి ఉద్యోగవకాశాలు లభిస్తాయంటే మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డికి నచ్చట్లేదని విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి పర్యటన ఏర్పాట్ల నేపథ్యంలో ఎచ్చెర్లలో 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్'తో ఆయన మాట్లాడారు. 'వైఎస్ఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అడ్రస్ లేని కంపెనీలను జగన్మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసుకుని కోట్లాది రూపాయలు కొల్లగొట్టిన విషయం ప్రజలందరికీ తెలుసు. ఇప్పుడు టాటా కంపెనీ కోసం భూములు ఇస్తే... ఇడ్లీ రూపాయికి కూడా రావని మాజీ సీఎం జగన్ ఆరోపించడం సరికాదు. పదివేల మంది యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయన్న కారణంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కృషితో విశాఖపట్టణంలో 'టాటా' కంపెనీకి భూములు కేటాయించారు. ఈ నిర్ణయం వల్ల అటు ఎన్డీఏ ప్రభుత్వం, ఇటు ఉత్తరాంధ్ర ప్రజలు, యువత సంతోషంగా ఉన్నారు. విశాఖ అభివృద్ధిని ఇడ్లీతో పోల్చడం.. వైసీపీ హయాంలాగానే ఇప్పుడు పరిస్థితులు ఉన్నాయన్నట్లు ప్రకటనలు చేయడం హాస్యాస్పదం. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎందరో పారిశ్రామికవేత్తలకు చెందిన విలువైన భూములు, ప్రజల ఆస్తులు విశాఖపట్టణంలో కబ్జాకు గురయ్యాయి. ప్రజలు ఎన్నికల్లో గట్టిగా తీర్పుఇచ్చినా మార్పు రాకుంటే.. ప్రజల్లో జగన్‌మోహనరెడ్డి మరింత దిగజారిపోయినట్లే' అని ఎంపీ కలిశెట్టి వ్యాఖ్యానించారు.

శ్రీకూర్మంలో తాబేలు పిల్ల మృత్యువాత



తాబేలు పిల్లను పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారి చక్రధరరావు

గార, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): శ్రీకూర్మనాథుని క్షేత్రంలో తాబేళ్ల మృత్యువాత సంఘటనలు కొనసాగుతున్నాయి. ఇటీవల కొన్ని తాబేళ్ళు మృత్యువాత పడిన సంఘటన మరచిపోకముందే శుక్రవారం ఓ తాబేలు పిల్ల చనిపోయింది. పార్కులో తాబేళ్లను సంరక్షిస్తున్న మహిళ ఒక తాబేలు పిల్ల చనిపోయినట్లు ఆలయ ఈవో కె.నరసింహనాయుడుకు తెలిపింది. ఈ మేరకు ఆమె నుంచి ఆయన రాత పూర్వకంగా వివరాలు తీసుకున్నారు. అటవీ శాఖ, పశుసంవర్థక శాఖ అధికారులకు సమాచారం ఇచ్చినట్టు ఈవో నరసింహనాయుడు విలేకరులకు తెలిపారు. అటవీ శాఖ సెక్షన్ ఆఫీసర్ చక్రధరరావు, సిబ్బంది శ్రీకూర్మం చేరుకొని చనిపోయిన తాబేలు పిల్ల బరువు, కొలతలను తీసుకున్నారు. సుమారు 65 గ్రాముల బరువుతో ఉన్న ఈ తాబేలు పిల్లకు ఏడాది వయస్సు ఉంటుందని భావిస్తున్నారు. అక్కడి నుంచి ఈ తాబేలు పిల్లను అటవీశాఖ ఎఫ్.ఎస్.ఒ., సిబ్బంది స్థానికంగా ఉన్న పశువుల ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తీసుకువెళ్లారు.

ట్యాంకర్లతో నీరు సరఫరా చేయండి



ఏఈతో మాట్లాడుతున్న రాజు

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ట్యాంకర్ల ద్వారా పూర్తి స్థాయిలో అన్ని వార్డులకు తాగునీరు అందించాలని జనసేన ఇన్‌చార్జి దాసరి రాజు మున్సిపల్ అధికారులను కోరారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో అసిస్టెంట్ ఇంజనీర్ పృథ్వీని కలిసి వినతిపత్రం అందజేశారు. రోజుకి ఒక్కో వార్డుకు కేవలం 4 ట్యాంక ర్లతో మాత్రమే సరఫరా చేస్తున్నారని తెలిపారు. తక్షణమే తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గణితధారణ



విద్యార్థులకు సమాధానాలు చెబుతున్న తిరుపతిరావు

కంచిలి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): చొట్రాయిపురం గ్రామంలో గణిత అవధాని మడ్డు తిరుపతిరావు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన గణితధారణ కార్యక్రమం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాల, కళాశాలల విద్యార్థులకు గణితంపై ఆసక్తి పెంచేందుకు తిరుపతిరావు ప్రయత్నించారు. కళ్లకు గంతలు కట్టుకొని బోర్డుపై రాసిన ఒకటి నుంచి వంద సంఖ్యలు, వాటి ఎదురుగా ఉన్న వస్తువుల పేర్లను విద్యార్థులు అడిగిన వెంటనే చెప్పడం ఆకట్టుకుంది. కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పశువైద్యాధికారులపై విచారణ చేపట్టాలి

బూర్జ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పశువైద్యాధికారిణిగా విధులు నిర్వహిస్తున్న జోత్స్న, కొల్లివలస పశువైద్య కేంద్రం వైద్యాధికారి వెంకటరావులు విధులను సక్రమంగా నిర్వహించడం లేదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాపు సింహాచలం ఆరోపించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పాడి రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు ఉన్నతాధికారులు విచారణ చేపట్టి, చర్యలు తీసుకోవాలని కోరారు.

నవధాన్యాల సాగుతో నేల సారవంతం

కంచిలి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): నవధాన్యాల సాగుతో నేల సారవంతమవుతుందని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ దుర్గాప్రసాద్ అన్నారు. బూరగాంలో ప్రకృతి వ్యవసాయంతో కలిగే ప్రయోజనాలను శుక్రవారం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఖరీఫ్ సాగుకు ముందు నవధాన్యాల సాగు చేయడం వల్ల అధిక లాభాలు కలుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.

సదస్సును విజయవంతం చేయండి

అరసవల్లి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న నిర్వహించనున్న పెన్షనర్ల ఐక్యవేదిక సదస్సును విజయవంతం చేయాలని ఆ సంఘ కన్వీనర్ ఎం.ఆదినారాయణమూర్తి పిలుపునిచ్చారు. స్థానిక ఎన్జీవో హోమ్‌లో శుక్రవారం జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ విధానాలు పెన్షన్ భద్రతను ప్రశ్నార్థకం చేస్తున్నాయన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం చేసిన చట్టం ప్రకారం చెల్లించే పెన్షన్ మొత్తానికి గ్యారెంటీ లేదన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు డి.పార్వతీశం, కె.సోమసుందరరావు తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు పరిహారం పంపిణీ

కంచిలి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కత్తివరం విశాఖ డెయిరీ బల్క్‌మిల్క్ సెంటర్ వద్ద పాడిరైతులకు రూ.5,80,000 నగదును బోర్డు డైరెక్టర్ ఆరింగి రమణబాబు శుక్రవారం పంపిణీ చేశారు. పెద్ద కొజ్జిరియా, సాలినపుట్టుగ, శ్రీరాంపురం, దూగాన పుట్టుగ, గొనపపుట్టుగ, కొరికానపుట్టుగ, జన్నిపుట్టుగ పాల కేంద్రాలలో పశుబీమా క్లెయిమ్‌లకు సంబంధించిన నగదును రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టెక్కలి యూనిట్ మేనేజర్ శ్రీరామ్మూర్తి, సూపర్‌వైజర్‌లు పి.ఈశ్వరరావు, ప్రసాద్, శేఖర్ పాల్గొన్నారు.

'నాడు-నేడు'తో విద్యావ్యవస్థ ఛిన్నాభిన్నం: ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం నాడు-నేడు పథకం ద్వారా దోపిడీతో విద్యా వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసిందని ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆరోపించారు. శుక్రవారం తాళ్లవలస వద్ద ఉన్న కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన లైబ్రరీ, ల్యాబ్ భవనాలను ఆయన ప్రారంభించారు. రూ.25 లక్షలతో నూతనంగా నిర్మించనున్న అదనపు భవనాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి తిరుమల చైతన్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ బాలికలకు ఉన్నత విద్యను అందించడానికి చంద్రబాబునాయుడు కేజీబీవీలను ప్రవేశపెట్టారని చెప్పారు. కూటమి ప్రభుత్వం పది నెలల పాలనలో వీటి కోసం రూ.ఏడు కోట్లు మంజూరు చేసిందని వివరించారు. గత వైసీపీ ప్రభుత్వం నాడు-నేడుతో ప్రకటనలే తప్ప ఎటువంటి అభివృద్ధి చేయలేదని అన్నారు. నాడు-నేడుతో 11 లక్షల మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలను ఆశ్రయించారని అన్నారు. స్థానిక కేజీబీవీ పాఠశాలలో ఒక్క తెలుగు ఉపాధ్యాయురాలు ఉండడం వల్ల ఇబ్బందిగా ఉంటోందని, మరొకరిని నియమించాలని డీఈవోను ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో సర్వశిక్షా అభియాన్ ఏపీసీ శశిభూషణరావు, జెడ్పీటీసీ బెండి గోవిందరావు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీత, విద్యాసాగర్, నాయకులు తమ్మినేని చంద్రశేఖర్, సనపల ఢిల్లీశ్వరరావు, బోర గోవిందరావు, అన్నెపు భాస్కరరావు, తంగి గురయ్య, ఎన్ని శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజాదర్బార్: ఎమ్మెల్యే



గోరువానిపేటలో స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శుక్రవారం స్థానిక విశాఖ-ఏ కాలనీలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన పాల్గొని వినతులు స్వీకరించారు. శ్రీకాకుళం, గార మండలాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలను వివరించారు. చాలా వరకు అప్పటికప్పుడే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, పరిష్కారానికి కృషి చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

విశాఖ-ఏ కాలనీలో గల తన క్యాంపు కార్యాలయంలో పలువురు బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల ను ఎమ్మెల్యే గొండు శంకర్ అందజేశారు. కల్లేపల్లికి చెందిన గుడ్ల దుర్గాసికి రూ.66,572, తండ్యా ల తవిటిరాజుకి రూ.4.10 లక్షలు, సామవరపు స్రవంతికి రూ.10లక్షలు చొప్పున చెక్కులు అందజేశారు.

బ్యాంకుల తోడ్పాటు అవసరం

బ్యాంకుల తోడ్పాటుతో రైతులు, పారిశ్రామికవేత్తలు అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

పల్లె నిద్ర

గార, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సమస్యల పరిష్కరించడానికి పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టినట్టు ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం గోరువానిపేట, చింతువలస గ్రామాల్లో ఆయన పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ రెండు గ్రామాల్లో సమస్యలను తెలుసుకొని... అధికారులతో చర్చించి... పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోరు అనిత, ఎంపీడీఓ ఎస్.రామమోహనరావు, తహశీల్దార్ ఎం.చక్రవర్తి, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

రేపు బాస్కెట్‌బాల్ జట్ల ఎంపికలు

శ్రీకాకుళం స్పోర్ట్స్ ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూలు మైదానంలో ఈ నెల 27న జిల్లా స్థాయి బాస్కెట్‌బాల్ జట్ల ఎంపికలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి తెలిపారు. ఈ ఎంపికలకు 13 ఏళ్లలోపు బాలబాలికలు హాజరు కావాలని సూచించారు. ఇందులో ఎంపికైన వారు మే 15 నుంచి చిత్తూరులో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు లను శిక్షకులు అర్జున్ రెడ్డికి సమర్పించాలని సూచించారు.

సచివాలయంపై జగన్ బోర్డుల తొలగింపు



బోర్డులను తొలగిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వార్డు సచివాలయంపై మాజీ సీఎం జగన్ ఫొటోలతో ఉన్న బోర్డులను నగర పాలక సంస్థ అధికారులు తొలగించారు. సంతోషిమాత ఆలయం సమీపంలో ఉన్న వార్డు సచివాలయం ముందర జగన్ ఫొటోలతో బోర్డులను గురువారం వరకూ ఉంచారు. ఈ విషయాన్ని శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో 'ఇంకా జగన్ నామస్మరణమే' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై టీడీపీ నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్, మరికొందరు తెలుగుదేశం నాయకులు సచి వాలయం వద్ద కు వెళ్లి సిబ్బందిని ప్ర శ్నించారు. ప్రభుత్వం మారి పదినెలలైనా మాజీ సీఎం ఫొటోను బోర్డులపై ఉంచడం సరికాదని సిబ్బందిపై మండిపడ్డారు. దీంతో నగర పాలక సంస్థ సిబ్బంది వచ్చి.. జగన్ ఫొటోలతో ఉన్న బోర్డులను తొలగించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

జాగ్రత్తలతోనే మలేరియా నివారణ



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ అనిత

అరసవల్లి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): సరైన జాగ్రత్తలు పాటించి మలేరియాను నివారిద్దామని డీఎంహెచ్‌వో డాక్టర్ అనిత పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రపంచ మలేరియా వ్యతిరేక దినం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆమె ప్రారంభించి మాట్లాడారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమలవృద్ధికి అవకాశం లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గత ఐదేళ్లలో మలేరియా కేసులు జిల్లాలో గణనీయంగా తగ్గాయన్నారు. కాలువల్లో గంబూషియా చేపలు విడుదల చేసి దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో రసాయనాలు పూసిన దోమతెరలు పంపిణీ చేస్తున్నామన్నారు. అందరితో మలేరియా నివారణపై ప్రతిజ్ఞ చేయించారు. తొలుత డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి ఏడురోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది ప్లకార్డులు పట్టుకుని మలేలియా నియంత్రణపై నినాదాలు చేశారు. ఈ ర్యాలీని డీఎంహెచ్‌వో అనిత జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో అదనపు డీఎంహెచ్‌వో తాడేల శ్రీకాంత్, జిల్లా మలేరియా అధికారి సత్యనారాయణ, డిప్యూటీ డీఎంహెచ్‌వో మేరీ కేథరిన్, ప్రోగ్రాం అధికారి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పొన్నాడలో

ఎచ్చెర్ల, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పొన్నాడ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మలేరియా దినోత్సవ ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.ఉషశ్రీ మాట్లాడుతూ జ్వరాలు వచ్చినప్పుడు వ్యాధినిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ జి.సుధ, ఆరోగ్య పర్యవేక్షకులు ఎం.డేవిడ్‌రాజు, డి.లిల్లీరోజ్ మేరీ పాల్గొన్నారు.

ఒక పండు.. మూడు పిక్కలు



మూడు పిక్కలతో ఉన్న జీడి పండు

కవిటి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): సాధారణంగా జీడిపండుకు ఒకే పిక్క ఉంటుంది. కానీ రామయ్య పుట్టుగకు చెందిన పి.శివప్రసాద్ అనే రైతు తోటలో ఒక్క పండుకి మూడు పిక్కలు కనిపించాయి. శుక్రవారం తోటలో జీడిపిక్కలు సేకరిస్తున్న సమయంలో ఒక చెట్టులో ఈ పండు కనిపించిందని రైతు తెలిపారు. ఇలా చాలా అరుదుగా ఉంటాయని రైతులు చెప్పారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బాలికల కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం జనరల్, వృత్తి విద్య కోర్సులలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శంకర్‌రావు ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ, ఎంబైపీసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ అడ్మిషన్లు జరుగుతున్నాయని తెలిపారు.

పత్రిక ప్రకటన

ఇచ్ఛాపురం పురపాలక సంఘం పరిధిలో జి.ఓ.యం.యస్ నెం.20, తే 04.02.2025ది అనుసరించి ప్రజలకు సులభముగా స్వీయ ధృవీకరణ అంగీకార పత్రము సమర్పించి భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేయుట కొరకు లైసెన్సు టెక్నికల్ సర్వేయర్/లైసెన్సు స్ట్రక్చరల్ ఇంజనీరుగా లైసెన్సు పొందుటకు గాను ఆసక్తి గల, అర్హులైన అభ్యర్థులు (ఐ.టి.ఐ సివిల్, డిప్లొమా సివిల్ మరియు బి.టెక్ సివిల్) ఈ కార్యాలయము నేరుగా గాని లేదా APOBPS / APDPMS పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవలసినదిగా కోరడమైనది.

ఇట్లు
కమీషనరు, ఇచ్ఛాపురం పురపాలక సంఘం

ఆంధ్రా-ఒడిశా ఎక్సైజ్ అధికారుల దాడులు

- 1,120 లీటర్ల సారా స్వాధీనం
- 10,600 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



సారా తయారీకి ఉపయోగించిన వస్తువులను స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ అధికారులు

పాతపట్నం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా-ఒడిశా సరిహద్దు గ్రామాల్లో ఇరు రాష్ట్రాల ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు శుక్రవారం ఆకస్మికంగా దాడులు చేశారు. శ్రీకాకుళం డీపీఈవో సీహెచ్ తిరుపతినాయుడు, గంజాం జిల్లా ఈఎస్ ప్రదీప్‌కుమార్ సాహు సంయుక్త ఆధ్వర్యంలో ఆంధ్రాలోని పాతపట్నం, కొత్తూరు మండలాల ఆంధ్రా-ఒడిశా సరిహద్దులోని ఒడిశా గ్రామాలైన సింగుపురం, నేరేడిగూడ, శిరడా, గురిసింగి గూడ తదితర గిరిజన గూడలతో పాటు సమీపంలోని కొండలపై గ్రామాల్లోనూ ముమ్మరంగా దాడులు చేశారు. ఈ సందర్భంగా సుమారు 10,600 లీటర్ల పులిసిన బెల్లం ఊటను ధ్వంసం చేసి 1,120 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు తిరుపతినాయుడు తెలిపారు. జిల్లా సహాయ కమిషనర్ డి.శ్రీకాంత్ రెడ్డి పర్యవేక్షణలో జరిగిన ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌చార్జి ఏఈఎస్ ఎం.శ్రీనివాసరావు, పాతపట్నం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కోట కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

పిచ్చికుక్క దాడిలో 8 మందికి గాయాలు

పలాస, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ తిలక్ నగర్‌లో పిచ్చికుక్క శుక్రవారం దాడి చేసి 8 మందికి గాయపరిచింది. గాయపడిన వారిలో తిలక్ నగర్‌లో చంద్రశేఖర్, అప్పయ్యమ్మ, కె.శ్రావణి, చినబడాం గ్రామానికి చెందిన ఎల్.గౌరి, తాళభద్రకి చెందిన కె.సాంబయ్య, రాజగోపాలపురానికి చెందిన ఎన్.తులసమ్మ తదితరులున్నారు. వీరంతా పలాస ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు

కొత్తూరు ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కొత్తూరు మండలం గూనభద్ర ప్రధాన కాలువ రెగ్యులేటర్ వద్ద శుక్రవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ద్విచక్ర వాహనంపై దిలీప్‌సింగ్ వెళు తుండగా మెట్టూరు వైపు నుంచి కొత్తూరు వస్తున్న కారు అదే సమయం తో పారాపురం రిజర్వాయర్ గట్టు టర్నింగ్ వద్ద ఢీకొని అతడికి తీవ్రంగాయాలయ్యాయి. వెంటనే అతడిని స్థానికులు కొత్తూరు ఆసుపత్రికి తరలించారు. అనంతరం దిలీప్ సింగ్ నుంచి స్టేట్‌మెంట‌ను రికార్డు చేసి కేసు నమోదు చేసినట్లు కొత్తూరు హెచ్‌సీ కోటేశ్వర రావు తెలిపారు.

తాగునీటి సౌకర్యం కల్పించడంలో ప్రభుత్వం విఫలం



దబ్బపాడులో ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి, గ్రామస్థులు

ఎల్.ఎన్.పేట, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని, నీటి సదుపాయం కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. దబ్బపాడు గ్రామంలో శుక్రవారం స్థానికులతో కలిసి ఖాళీ బిందెలు పట్టుకుని నిరసన తెలిపారు. వంశధార నది ఒడ్డున ఉన్నప్పటికీ తాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదని, సమస్యలను ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని స్థానికులు పేర్కొన్నారు. గ్రామాల్లో లక్షలాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే గోవిందరావు చెబుతున్నప్పటికీ ఆ దాఖలాలు ఎక్కడా లేవని ఆమె విమర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆర్.జ్యోతిలక్ష్మి, సర్పంచ్ ఎం.మోహిని, ఎంపీటీసీ పి.జయలక్ష్మి, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

అ'పూర్వ' కలయిక



నాటి ఉపాధ్యాయులతో విద్యార్థులు

హిరమండలం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): తులగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999-2000లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు శుక్రవారం స్థానికంగా ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరికొకరు పరిచయం చేసుకుని నాటి, నేటి విషయాలను తెలుపుకుంటూ ఆనందం పొందారు. నాడు విద్యా బుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులను సత్కరించారు. సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక బోర్డును పునరుద్ధరించాలి

టెక్కలి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు నంబూరు షణ్ముఖరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కార్మిక శాఖాధికారికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 30లక్షల మంది నిర్మాణ కార్మికులు సంక్షేమ బోర్డుకు తమ వాటా చెల్లించి ఉన్నారన్నారు. అయితే ఈ నిధులను ప్రభుత్వం ఖర్చు చేసి కార్మిక సంక్షేమాన్ని విడిచి పెట్టిందని విమర్శించారు. కార్యక్రమంలో టెక్కలి భవన నిర్మాణ కార్మికుల సంఘం నాయకులు గూన త్రినాథ్, తిర్లంగి అప్పన్న, ధవళ లక్ష్మీనారాయణ, బెండి హర్ష, కొర్రాయి ఆనంద్, సత్తారు ఉత్తర తదితరులు పాల్గొన్నారు.



కార్మిక శాఖాధికారికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఏళ్ల తరబడి ఇలాగే..

- వరదలొస్తే మూడు నెలల పాటు రాకపోకలు బంద్
- ఆవేదన వ్యక్తంచేస్తున్న గ్రామాల ప్రజలు
- ఇదీ కడపల గెడ్డ దుస్థితి



కడపలగెడ్డపై ప్రవహిస్తున్న వరద నీరు(ఫైల్)

ఎల్.ఎన్.పేట, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తురకపేట-దబ్బపాడు గ్రామాల మధ్య ఉన్న కడపల గెడ్డపై నుంచి వర్షాకాలంలో ఏమాత్రం వరదనీరు ప్రవహించినా ఆయా గ్రామాలకు రాకపోకలు బంద్ కావాల్సిందే. ఏటా వరద ప్రభావంతో మూడు నెలలపాటు నిత్యం నరకమేనని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఈ గెడ్డపై వంతెన నిర్మాణం చేపట్టాలని అనేక పర్యాయాలు ప్రజా ప్రతినిధులు, అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్న ఆవేదన వారిలో వ్యక్తమవుతోంది. అత్యవసర సమయాల్లో ఈ గ్రామాల ప్రజలు అలికాం-బత్తిలి ప్రధాన రోడ్డుకు వెళ్లాలంటే వాడవలస, మిరియాపల్లి, లక్ష్మీనర్సుపేట గ్రామాల మీదుగా సుమారు ఆరు కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోందని గ్రామస్థులు జె.మోహనరావు, పి.సీతారాం, పి.రమణయ్య, రామారావు తదితరులు పేర్కొంటున్నారు. వర్షాకాలంలో కురిసిన వర్షా లకు కడపలగెడ్డ రోడ్డుపై వాహనాల రాకపోకలకు వీలు లేకుండా నీటి ప్రవాహం ఉంటుంది. ఒక్కో సమ యంలో వాహనాలు సైతం నీటిలో నిలిచిపోయి ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి. అధికారులు, ప్రజా ప్రతినిధులు హామీలైతే ఇస్తున్నారని కాని అవి ఆచరణలో కనిపించడం లేదని, దీంతో తాము నిత్యం ఇబ్బందులు ఎదుర్కోనాల్సి వస్తోందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి కడపల గెడ్డపై బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేసినా ఏళ్ల గడిచి ఆ ప్రభుత్వం వెళ్లిపోయినా నేటికీ పనులు ప్రారంభం కాలేదని, కూటమి ప్రభుత్వం స్పందించి మా గ్రామాల సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి: శిరీష



వినతులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): నియోజక వర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై దృష్టి సారించి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నా రు. శుక్రవారం తన ప్రజాదర్బార్ నిర్వహించి వినతులు స్వీకరించారు. పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.14.68 కోట్లు మంజూరు చేశామని, మందస మండలంలో రూ.8కోట్లతో తారు రోడ్డు పనులు జరుగుతున్నాయన్నారు. మే మొదటి వారంలో పట్టణానికి తాగునీరు సరఫరా చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. వజ్రపుకొత్తూరు మండలం నువ్వలరేవు గ్రామానికి చెందిన మువ్వల నగేష్ మృతి చెందాడని, న్యాయం చేయాలని అతని తల్లి మువ్వల సుందరి కోరారు. మత్స్యకారుల జీవనభృతిలో అవకతవకలు జరిగాయని వాటిని సరిచేయాలని గుణుపల్లికి చెందిన మత్స్యకారులు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఏపీట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పీరికట్ల విఠల్ రావు, నాయ కులు లొడగల కామేశ్వ రరావు, గురిటి సూర్య నారాయణ, గాలి కృష్ణారావు, బడ్డ నాగరాజు, కొండే నర్సింహులు పాల్గొన్నారు.

వారధులుగా నిలవాలి: ఎంజీఆర్



వినతులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

పాతపట్నం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై దృష్టి సారించి వాటి పరిష్కారానికి వారధులుగా నిలవాలని టీడీపీ క్యాడర్‌ను ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో 'కార్యకర్తే అధినేత' కార్యక్రమం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీకోసం పనిచేసే వ్యక్తులను అధిష్ఠానం గుర్తించి తగు సమయంలో సముచిత స్థానం ఇస్తుందన్నారు. అలాగే ప్రజల నుంచి వినతులను స్వీకరించారు.

మద్యం దుకాణం ఇక్కడొద్దు

- హౌసింగ్ బోర్డు కాలనీ వాసుల నిరసన
- ఎమ్మెల్యే, ఎక్సైజ్ అధికారులకు వినతులు



ఎక్సైజ్ కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న మహిళలు

పాతపట్నం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మా కాలనీ వద్ద మద్యం దుకాణం వద్దని హౌసింగ్ కాలనీ వాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఎక్సైజ్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో మద్యం దుకాణం వల్ల మహిళలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. మద్యం దుకాణం ఉన్న ప్రాంతంలోనే స్థానిక వసతి గృహ విద్యార్థులు ఆడుకుంటుంటారన్నారు. అలాగే వెలుగు కార్యాలయానికి వచ్చే వారు ఈ ప్రదేశాన్ని బహిర్భూమిగా వినియోగిస్తున్నారన్నారు. ప్రధానంగా మద్యం మహిళలు, విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపడంతో పాటు అభద్రత కలిగే అవకాశం ఉందన్నారు. తక్షణం దుకాణ ఏర్పాటును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై ఎమ్మెల్యే గోవింద రావు స్పందిస్తూ.. మహిళా భద్రత ముఖ్యమని, వారికి ఇబ్బంది కలిగే ఏ నిర్ణయాన్నైనా తాను వ్యతిరే కిస్తానన్నారు. వెంటనే ఎక్సైజ్ అధికారులతో ఫోన్‌లో సంప్రదించి తక్షణం తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంపీడీవో సలాన చిరంజీవి, బీజేపీ నాయకుడు దుక్క శ్రీకాంత్, రేగేటి ఆనందరావు, కొంచాడ బాబూరావుతో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

కిడ్నీ ఆసుపత్రిలో ఉద్యోగాల తాత్కాలిక జాబితా విడుదల

- అభ్యంతరాలకు 28వ తేదీ వరకు అవకాశం

పలాసరూరల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్ అండ్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఔట్‌సోర్సింగ్ ప్రతిపాదికన భర్తీ చేయనున్న వివిధ పోస్టుల భర్తీకి సంబంధించి తాత్కాలిక ఎంపిక జాబితాను శుక్రవారం విడుదల చేశారు. ఈ మేరకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన జరిగిన కమిటీలో చర్చించి జాబితాను ప్రకటించారు. రిసెప్షన్ కమ్ రిజిస్ట్రేషన్ క్లర్క్, డయాలసిస్ టెక్నీషియన్, సీ-ఆర్మ్ టెక్నీషియన్, జనరల్ డ్యూటీ, సెక్యూరిటీ పోస్టులకు 289 దరఖాస్తులు రాగా వాటిని పరిశీలించి ఈ జాబితాను రూపొందించారు. ఈ జాబితాలపై అభ్యర్థులకు ఏమైనా అభ్యంతరాలుంటే వాటిని గ్రీవెన్స్‌లో దరఖాస్తుతో సహా ఏప్రిల్ 28వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా ఆసుపత్రి కార్యాలయంలో అందజేయాలని సూపరింటెండెంట్ అల్లు పద్మజ తెలిపారు. తాత్కాలిక జాబితా గ్రీవెన్స్ ఫారాన్ని డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.శ్రీకాకుళం.ఏపీ.జీవీ.ఇన్ వెబ్‌సైట్‌లో చూడవచ్చని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

సొంత ఖర్చులతో ఆసుపత్రిలో బోరు ఏర్పాటు



బోరును ప్రారంభిస్తున్న సర్పంచ్ కృష్ణవేణి

కొత్తూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఆసుపత్రిలో రోగులకోసం సర్పంచ్ పడాల కృష్ణవేణి, భర్త లక్ష్మణరావు సొంత ఖర్చులతో బోరును ఏర్పాటు చేసి శుక్రవారం ప్రారంభించారు. స్థానిక సామాజిక ఆసుపత్రిలో రోగులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్న విషయమై పలువురు రోగులు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు దృష్టికి తీసుకువెళ్లారు. దాతలు ముందుకు వచ్చి రోగుల దాహార్తి తీర్చాలని ఎమ్మెల్యే కోరడంతో సర్పంచ్ స్పందించి తన సొంత నిధులతో బోరును తీయించారు. దీంతో రోగులు, వారి సహాయకులు హర్షం వ్యక్తంచేసి సర్పంచ్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ ధర్మాన కిషోర్, వైద్యులు అనూరాధ, మాజీ ఎంపీటీసీ ఎల్.జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

వజ్రపుకొత్తూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఎండతీవ్రత అధికంగా ఉన్నందున ప్రజలు వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని వజ్రపుకొత్తూరు పీహెచ్‌సీ వైద్యుడు రిచర్డ్ బూన్ అన్నారు. నువ్వలరేవు గ్రామంలో ప్రజలు జ్వరాల బారిన పడిన నేపథ్యంలో సర్పంచ్ మువ్వల పూర్ణ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యుడు మాట్లాడుతూ.. అత్యవసరమైతేనే బయటకు రావాలని, వచ్చినప్పుడు టోపీ ధరించాల న్నారు. మంచినీరు, మజ్జిగ, నిమ్మరసం అధికంగా తీసుకోవాలన్నారు. అనంతరం పలువురు రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు వెంకటేష్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

హరిపురం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని మందస వైద్యాధికారి మద్దిల సంపత్‌రావు అన్నారు. మందస-2 సచివాలయంలో శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు పరీక్షలు చేసి మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు తాగేందుకు నీటిని వెంట తీసుకెళ్లాలని, టోపీ ధరించాలని కోరారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

హరిపురం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): బాలిగాం గ్రామంల అభయాంజనేయ ఆలయ 31వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ధర్మకర్త చమళ్ల ప్రకాశరావు కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో వేదపండితులు నారాయణస్వామి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కిషోర్, గౌతమి, గంగాధర్, చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి సంగీత శిక్షణ శిబిరాలు ప్రారంభం

శ్రీకాకుళం కల్చరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో వేసవి సంగీత శిక్షణ శిబిరాలు ప్రారంభమయ్యాయి. కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న 'ఆరోహి స్కూల్ ఆఫ్ మ్యూజిక్‌లో పెంకి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు శుక్రవారం నుంచి ఉచితంగా సంగీత పాఠాలు బోధిస్తున్నారు. ప్రతి రోజు ఉదయం 8 నుంచి 10 గంటల వరకు శిక్షణ ఇస్తారు. ఈ శిబిరంలో భాస్కరభట్ల శ్రీరామ్మూర్తి వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహించనున్నారు. స్థానిక కత్తెరవీధిలోని శ్రీ రాజరాజేశ్వరి సంగీత విద్యాపీఠం ఆధ్వర్యంలో వేసవి శాస్త్రీయ సంగీత శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. పీఠం వ్యవస్థాపకులు లక్ష్మీగణపతి శర్మ శిక్షణ ఇవ్వనున్నారు.

బుడగట్లపాలెం తరలిరండి

పోలాకి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని 1,450 మంది మత్స్యకారులకు వేట నిషేధ భృతి ఇచ్చేందుకు అర్హులుగా గుర్తించినట్లు మత్స్యశాఖ ప్రతినిధులు బాడి సురేష్‌కుమార్, ఢిల్లీశ్వరరావు తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ.. ఒక్కొక్కరికి రూ.20 వేల వంతున సీఎం చంద్రబాబు ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెంలో శనివారం అందజేస్తారని, మత్స్యకారులు తరలిరావాలని కోరారు. గుప్పెడుపేట, కొత్తరేవు, రాజారాంపురం, గుల్లవానిపేట, కొవిరిపేట, గ్రామాల్లో వేటకు వెళ్లే మత్స్యకారులను సర్వే ద్వారా గుర్తించినట్లు పేర్కొన్నారు.

న్యూస్ బాక్స్

భూసార పరీక్షలతో మేలు

మెళియాపుట్టి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షల ద్వారా రైతులకు మేలు చేకూరుతుందని వ్యవసాయశాఖ ఏడీ లింగాల మధుబాబు అన్నారు. శుక్రవారం జర్రిభద్ర గ్రామం లో మట్టి నమూనాల సేకరణ తీరునుపరిశీలించారు. ఈ ఏడాది 2219 మట్టి నమూనాలు సేకరించడం జరుగుతుందన్నారు. పరీక్షల ఫలితాలను రైతులకు తెలియజేస్తామని, అనంతరం వ్యవసాయాధికారుల సూచనలతో ఎరువులు వాడాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది నవీన్, వాసు, ధరణ్ పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు

మెళియాపుట్టి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని ఎంపీఈవో ప్రసాద్‌పండా తెలిపారు. శుక్రవారం అంపురం గిరిజన గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీల్లో తాగునీటి సమస్యల పరిష్కారానికి నిధులు ఇవ్వడం జరుగుతుందన్నారు. అశ్రద్ధ వహించకుండా కార్యదర్శులు పనిచేయాలన్నారు. ఇప్పటికే కొండలపై ఉన్న గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నామని చెప్పారు. పూర్తిగా నీరు లేకుంటే ట్యాంకర్లతో నీటి సరఫరా చేస్తామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి తవిటినాయుడు, సర్పంచ్ జమ్మయ్య పాల్గొన్నారు.

30న సామూహిక ఉపనయనాలు

పలాసరూరల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ పూజారివీధి రాధాకాంత మందిరంలో ఈ నెల 30న సామూహిక ఉపనయనాలు నిర్వహిస్తున్నట్లు జైజగన్నాథ్ ఒడియా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ త్యాడి ఒక ప్రకటనలో తెలిపారు. నిరుపేద ఒడియా బ్రాహ్మణుల పిల్లలు 25 మందికి ఉపనయనాలు చేస్తున్నామన్నారు.

పరికరాలను వినియోగించుకోవాలి

కోటబొమ్మాళి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కమ్యూనిటీ హైరింగ్ సెంటర్ల ద్వారా రాయితీపై అందిస్తున్న వ్యవసాయ యంత్ర పరికరాలను అద్దె ప్రాతిపదికన రైతులు వినియోగించుకోవాలని వ్యవసాయాధికారి ఎస్.గోవిందరావు అన్నారు. శుక్రవారం జర్జంగి సచివాలయం పరిధిలోని కమ్యూనిటీ హైరింగ్ సెంటర్‌ను సందర్శించారు. వేసవి దుక్కులకు ఈ యంత్రాలను వినియోగించుకోవాలని సూచించారు.

తూనికల్లో తేడాలొస్తే చర్యలు తప్పవు



సీల్ వేస్తున్న అధికారి శ్రీధర్

కోటబొమ్మాళి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): తూనికల్లో తేడాలొస్తే సంబంధిత వ్యాపారులపై చర్యలు తప్పవని పలాస తునికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ టి.శ్రీధర్ హెచ్చరించారు. శుక్రవారం మండ లంలోని పలువురు వ్యాపారుల కాటాలను పరిశీలించి సీల్ వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. తనిఖీలు చేపట్టినప్పుడు తప్పని సరిగా ప్రతి కాటాకి సీల్ ఉండాలన్నారు. సరైన తూకంతో పాటు నాణ్యమైన వస్తువులను అందించాలని సూచించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

నరసన్నపేట, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమల ఉత్పత్తి లేకుండా చూసుకోవాలని పీహెచ్‌సీ వైద్యులు గొలివి సుజాత అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఉర్లాం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దీనివల్ల మలేరియా వ్యాధిని అరికట్టే అవకాశం ఉంటుందన్నారు.

ఉగ్రదాడికి వ్యతిరేకంగా ర్యాలీ

జమ్ము కశ్మీర్ రాష్ట్ర పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు చేసిన దాడిని నిరసిస్తూ శుక్ర వారం జిల్లాలో పలు ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహించారు. కొవ్వొత్తులు పట్టుకుని మృతులకు సంతాపం తెలిపారు. క్షతగాత్రులు త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు.

-ఆంధ్రజ్యోతి బృందం



హరిపురం: కూడలిలో యువత మానవహారం



కంచిలి: కాగడాలతో ర్యాలీలో పాల్గొన్న మాజీ సైనికోద్యోగులు, నాయకులు, అధికారులు



ఇచ్ఛాపురం: మసీదు వద్ద నిరసన తెలుపుతున్న ముస్లింలు



అరసవల్లి: కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి తదితరులు



ఎచ్చెర్ల: ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో డైరెక్టర్ డాక్టర్ కేవీజీడీ బాలాజీ తదితరులు